10-12-98



కె.బాలగోపాల్

10-12-98

# మానభంగాలకు మరణదండన

మన హోమ్‌మంత్రి అద్వానీకి "మరణ దండన ప్రియుడు" అని బిరుదు ఈయవచ్చు. నేరాలు పెరిగి పోతున్నాయని ఆయనతో ఎవరు ఫిర్యాదు చేసినా "అయితే ఉరి తీసేద్దాం" అంటాడు. ఒక బి. జె. పి. నాయకుడు గానో ఆర్. ఎస్. ఎస్. నాయకుడిగానో ఆయన ఆ మాటలు మాట్లాడితే అది ఆ సంస్థల సిద్ధాంత వైపరీత్యం అని కొట్టి పారేయవచ్చు. కానీ ఈయన దేశానికి హోమ్ మంత్రి.

రేప్ కేసులకు కూడా మరణదండన విధించేటట్టు చట్టాన్ని సవరిస్తామని ఆయన అన్నారు. అంతకు ముందొకసారి, మారణాయుధాలుప పట్టుకుని తిరుగుతున్న వాళ్ళకు కూడా మరణదండన విధిస్తామన్నారు. ఇంకా ఎవరెవరిని ఆయన ఈ జాబితాలో చేరుస్తారో చూడాలి.

నేరాలు జరుగుతుండడానికి కారణం శిక్షలు కఠినంగా లేకపోవడమేననే విషయాన్ని గురించి ప్రాథమికమైన అవగాహనసైతం లేని వాళ్ళు చేసే ఆలోచన. స్త్రీలపైన లైంగిక అత్యాచారాలు విపరీతంగా జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని అందరూ ఒప్పుకుంటారు. కానీ చట్టం వాటిని అరికట్టలేకపోవడానికి ఉరిశిక్ష లేక పోవడమే కారణమా ? అసలు జరుగుతున్న రేప్ నేరాలలో ఎన్నిటిలో నిందితునికి శిక్షపడుతున్నది ? నూటికి నాలుగు కేసులలో కూడా శిక్షించడంలేదని అంచనా. శిక్ష అంత అరుదుగా పడేటప్పుడు అది ఉరిశిక్ష అయితేనేం, వేరే ఏదయితేనేం ? నూటికి నాలుగుకేసులు మించి నేరం రుజువు కానప్పుడు నేరం రుజువయితే ఉరిశిక్ష సైతం వేస్తామని బెదిరించి ఏం ప్రయోజనం ?

ఈ పరిస్థితికి ఉండడానికి పోలీసు యంత్రాంగం బాధ్యత ఉంది. సమాజం బాధ్యత (అంటే మనందరి బాధ్యత) ఉంది. బాధితురాలు ఫిర్యాదు చేయడానికే వెనుకాడుతుంది. నేరస్థుడి సంగతేమో కానీ తన భవిష్యత్తు ఏమవుతుందో అని ఆందోళన చెందుతుంది. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా చాలాసార్లు వెంటనే స్పందించరు. నేర పరిశోధన శ్రద్ధగా చేయరు. బాధితురాలిని వెను వెంటనే వైద్య పరీక్షకు (చాలా సందర్భాలలో) పంపించరు. దొమ్మీనీ, హత్యనూ, దొంగతనాన్నీ చూసినట్టు 'అర్జెంట్' గా, స్పందించవలసిన విషయంగా రేప్‌ను పరిగణించరు. వైద్యపరీక్షకు పంపించడంలో పోలీసులు ఆలస్యం చేయడం వల్ల సాక్ష్యం రుజువుకు నిలువకుండా పోయిన కేసులు చాలా ఉన్నాయి. వెంటనే పంపించినా వైద్యులు నిజాయితీగా పరీక్ష జరపని ఘటనలు చాలా ఉన్నాయి. లంచాల ప్రభావం బలంగా పని చేసే ఈ వ్యవహారాలలో (పోలీసులూ —వైద్యులూ అందరూ లంచగొండ్లేనని నా అభిప్రాయం కాదు. ) మగవాళ్ళకున్న సౌకర్యం స్త్రీలకుండదు.

ఎక్కువగా రేప్‌కు గురయ్యే పేద, దళిత స్త్రీలకు అసలే ఉండదు.

ఇక్కడిదాకా సవ్యంగా జరిగినా బాధితురాలి అసలు సమస్యలు ఆ తర్వాత మొదలవుతాయి. రేప్ చేసిన వాడి పరువుకేమీ ఢోకా ఉండదు. కానీ బాధితురాలి పరువు పోతుందని కుటుంబంలో, కులంలో, సమాజంలో ఒత్తిడి మొదలవుతుంది. అతడితో ఆమెకు ఏ కొంచెం పరిచయం ఉన్నా —"ఆమె ఎట్లాంటిదో —వాడికీ ఆమెకూ ఏ సంబంధం ఉందో" అన్న చర్చ మొదలవుతుంది. నిజానికి ఈ భయంతోనే చాలా మంది స్త్రీలు చెప్పుకోవడానికే భయపడతారు. లేదా ఆ తర్వాత రాజీపడతారు. పోలీసులు, ఇంటి పెద్దలు, కులం పెద్దలు, ఊరి పెద్దలు బలవంతంగా రాజీ చేయిస్తారు. ఇక్కడ సామాజిక వ్యవస్థలోనూ, ఆలోచనారీతులలోనూ చాలా సంస్కరణ తేవలసి ఉంది. కఠినమైన శిక్షల గురించి మాట్లాడడం ఈ అవసరాన్నీ, దానికి సంబంధించిన వైఫల్యాన్నీ కప్పిపెట్టడానికి మాత్రమే పనికొస్తుంది.

ఒకవేళ ఇదంతా అధిగమించి కేసు కోర్టు దాకా వచ్చినా బాధితురాలికక్కడ అవమానమే ఎదురవుతుంది. లైంగిక క్రియకు తాను సమ్మతించలేదని, తానే రుజువు చేసుకునే స్థితికి ఆమె నెట్టబడుతుంది. బ్రిటిష్ సంప్రదాయంలో రేప్‌కు సంబంధించిన చట్టం తొలినాడు ఆ నేరాన్ని స్త్రీ పైన అత్యాచారంగా భావించలేదు. లైంగిక నియమాలకు అపచారంగా భావించింది. అంటే భార్యాభర్తలు కాని స్త్రీ పురుషులు సంభోగించడం అందులోని ప్రధాన నేరం. ఆ తప్పులో పాల్గొన్న స్త్రీ 'అతను నన్ను బలవంతం చేశాడు' అని సంజాయిషీ చెప్పుకుంటున్నట్టు చట్టం ఆమె అభియోగాన్ని అర్థం చేసుకునేది. అందువల్ల ఆమె సాక్ష్యాన్ని అనుమానంగా చూడాలన్న నియమం ఉండేది. కాలక్రమంలో రేప్‌ను స్త్రీపైన అత్యాచారంగా అర్థం చేసుకోవడం మొదలయినప్పటికీ బాధితురాలి వాంగ్మూలాన్ని అనుమానంగా చూసే వైఖరి కోర్టులను ఇంకా వదిలిపెట్టలేదు. ఈ వైఖరి చట్ట విరుద్ధం అని సుప్రీంకోర్టు ఈ మధ్య కొన్ని తీర్పులలో ప్రకటించినప్పటికీ (దేశ ప్రధాన న్యాయమూర్తిగా ఉండిన జస్టిస్ అహ్మదీ 1995 లో కర్నైల్ సింగ్ కేసులో ఇచ్చిన తీర్పు ఒక మంచి ఉదాహరణ) న్యాయస్థానాల సంస్కృతిలో పెద్దగా మార్పు రాలేదు.


**ఉరిశిక్ష ఏ నేరానికీ జవాబు కాదనేది ఇవ్వాళ అంతర్జాతీయంగా జరుగుతున్న చర్చ. సంఘ్ పరివార్ హిందూత్వవాదులకు ఆ చర్చతో పరిచయం లేకపోవచ్చు. మానవతావిలువల పురోగమనానికి సంబంధించిన ఏ చర్చతో వాళ్ళకు పరిచయం ఉంది కనుక ? కానీ ఈ దేశం సంఘ్ పరివార్ జాగీరు కాదు. వాళ్ళ ఆలోచనల స్థాయికి ఈ దేశ నాగరికతను కుదించి వేయడానికి వీలు లేదు. మన నాగరికతకు నిజమైన నష్టం దాని నుంచి వస్తుంది. 'ఫైర్'వంటి సినిమాల నుంచి కాదు.**

అంతే కాకుండా బాధితురాలి ఫిర్యాదు అబద్ధమని రుజువుచేయడం కోసం ఆమె 'గత చరిత్ర' ను తవ్వి తీసే అవకాశం సాక్ష్యాల చట్టంలోని సెక్షన్ 155 (4) ముద్దాయికి ఇస్తుంది. కోర్టులో బోనెక్కిన బాధితురాలికి ఎవరెవరితోనో సంబంధం అంటగట్టి అవమానపరచడానికి ఇది ఉపయోగపడుతుంది. చట్టాన్ని సవరించడం ద్వారా రేప్ కేసులలో న్యాయం జరగడానికి తోడ్పడాలన్నదే అద్వానీ ఉద్దేశ్యమైతే ఈ విషయాలలో ఉపయోగకరమైన సవరణలకు చాలా అవకాశం ఉంది.

కానీ అన్ని నేరాల లాగా రేప్ విషయంలో కూడా కేవలం చట్టాలు —కోర్టులు అనే పరిధిలో ఆలోచిస్తే ప్రయోజనం లేదు. నేరాలు జరిగేది సమాజంలో. వాటికి నివారణ వెతకవలసింది సమాజంలో. నేరస్మృతి ఇందుకు ఒకానొక సాధనం మాత్రమే. సామాజిక బాధ్యత మొత్తం వదిలిపెట్టి నేర స్మృతిని మరింత 'కఠినం' చేస్తే సరిపోతుందనుకోవడం బల ప్రయోగం మీద అతి విశ్వాసం ఉంచడం. అది సమస్యను పరిష్కరించకపోగా నేరస్మృతినీ, న్యాయవ్యవస్థనూ వికృతంగా, అనాగరికంగా మారుస్తుంది.

తన లైంగిక అవసరాలకోసం స్త్రీని ఒక వస్తువుగా వాడుకునే 'హక్కు' మగవాడికి ఉందనే సంస్కృతి మన సామాజికవ్యవస్థలో ఉంది. రేప్‌కు సామాజికమూలం ఈ వికృతమైన 'హక్కే' —ఈ సంస్కృతిని పోగొట్టడానికి సామాజికంగా కృషి జరగడం అవసరం. ఆ బాధ్యతంతా ప్రభుత్వానిదే కాదు. కానీ ప్రభుత్వానికి కూడా ఈ విషయంలో ఒక విధానం ఉండాలి. అటువంటిదేమీ లేకుండా రేప్ చేసిన వాళ్ళను ఉరితీస్తామని ప్రకటించడం సులభమైన పరిష్కారంగా కనిపించవచ్చు కానీ అది కష్టతరమైన కర్తవ్యాన్ని తప్పించుకునే మార్గం మాత్రమే.

ఈ వికృత సంస్కృతిని పోగొట్టే కృషి సమాజంలో ఏమీ జరగకపోగా దానిని మరింత పెంచే సినిమా సంస్కృతి, చవుకబారు సాహిత్య సంస్కృతి రాజ్యమేలు తున్నాయి. ఈ సంస్కృతి ప్రభావంలో ఉన్న మగవాళ్ళకు ఏ స్త్రీనైనా లైంగికంగా లోబరుచుకోవడం అత్యంతసహజమైన విషయంగా కనిపిస్తుందే తప్ప ఒక తప్పుగానో, అన్యాయంగానో, నేరంగానో కనిపించదు.



ప్రభుత్వానికే కాదు. అద్వానీగారి పార్టీకి వారి మిత్ర 'సంఘ్ పరివార్' సంస్థలకూ కూడా ఈ విషయంలో ఒక అవగాహన కానీ, విధానంగానీ లేదు. వాళ్ళు తరచుగా 'మన సంస్కృతి' అంటూ ఆవేశపడుతుంటారు. 'మన సంస్కృతిని కాపాడుకోవాలి' అని గొడవ చేస్తుంటారు. కానీ ఈ 'మన సంస్కృతి' లోని లైంగిక హింస, దాన్ని మరింత పెంచుతున్న సినిమా, సాహిత్య సంస్కృతి వారికి అభ్యంతరకరంగా కనిపించవు. పోరాడవలసిన విషయాలుగా కనిపించవు. వారికి అభ్యంతరకరంగా కనిపించేవి, లైంగికత గురించి లైంగిక జీవితాన్ని గురించీ నిజాయితీగానూ, సున్నితంగానూ ఆలోచింపజేసే 'ఫైర్' వంటి సినిమాలు.

లైంగిక హింసను రెచ్చగొట్టే ఏ సినిమా పట్ల చూపించని వ్యతిరేకత వీళ్ళు ఈ సినిమా పట్ల చూపిస్తున్నారంటే వీళ్ళు 'మన సంస్కృతిని' కాపాడదలుచుకున్నది హింస నుండి, ఆధిపత్యం నుంచి కాదని, నిజాయితీగల ఆత్మావలోకనం నుంచి అనీ అర్థం అవుతుంది.

ఆ మూసలో తయారయిన అద్వానీకి రేప్‌కు జవాబు ఉరిశిక్షేనని తోచడంలో ఆశ్చర్యమేమీలేదు. కానీ ఉరిశిక్ష ఏ నేరానికీ జవాబు కాదనేది ఇవ్వాళ అంతర్జాతీయం జరుగుతున్న చర్చ. సంఘ్ పరివార్ హిందూత్వవాదులకు ఆ చర్చతో పరిచయం లేకపోవచ్చు. మానవతావిలువల పురోగమనానికి సంబంధించిన ఏ చర్చతో వాళ్ళకు పరిచయం ఉంది కనుక ? కానీ ఈ దేశం సంఘ్ పరివార్ జాగీరు కాదు. వాళ్ళ ఆలోచనల స్థాయికి ఈ దేశ నాగరికతను కుదించి వేయడానికి వీలు లేదు. మన నాగరికతకు నిజమైన నష్టం దాని నుంచి వస్తుంది. 'ఫైర్'వంటి సిని


## ప్రధానం

# అవసరమా?

మాల నుంచి కాదు.

'ప్రపంచంలో 56 దేశాలు మరణదండనను సంపూర్ణంగా చట్టాల నుంచి తొలగించాయి. మరో 40 దేశాలకు పైగా ఆచరణలో మరణదండన వేయడం మానేశాయి. అంటే ప్రపంచంలో దాదాపు సగం దేశాలు మరణ దండనకు దూరంగా ఉన్నాయి. ఆ దేశాలేమీ నాశనం అయిపోలేదు. మిగిలిన దేశాలలో అత్యధిక భాగం (ఇప్పటి వరకూ భారత దేశం లాగా) కేవలం హత్యానేరానికి, అవి కూడా అనేక పరిమితులతో, మరణదండన విధిస్తున్నాయి. ఒక్క సౌదీ అరేబియా, చైనా వంటి కొన్ని దేశాలు మాత్రమే హత్య కాక ఇతర నేరాలకు మరణ శిక్ష విధిస్తున్నాయి. దాని వలన ఆ దేశాలలో నేరాలు తగ్గిన దాఖలా లేమీ లేవు. మన దేశాన్ని కూడా ఆ స్థాయికి దిగజార్చాలన్న సంఘ్‌పరివార్ హోమ్ మంత్రి ప్రయత్నాన్ని ఆమోదించడానికి వీలు లేదు.

నిజానికి 1983 లో రేప్ చట్టాన్ని సవరించి కస్టడీలో రేప్, గ్యాంగ్ రేప్ వంటి వాటికి కఠినమైన శిక్షలు పెట్టారు.



ముద్దాయిపైననే నిర్దోషిత్వం రుజువు చేసుకునే బాధ్యత ఒక మేరకు పెట్టారు. ఇది ఎంత వరకు అమలవుతున్నది ? అమలు చేయడానికి పోలీసులు ఏమాత్రం నిజాయితీగా కృషి చేస్తున్నారు ? అమలు చేయించుకోవడానికీ, సామాజిక ఒత్తిడులనూ, అవమానాన్ని ఎదుర్కోవడానికి బాధితురాళ్ళకు ఏ మాత్రం సహాయం అందించడం జరుగుతున్నది ? దీనిని సమీక్షించకుండా శిక్షను మరింత కఠినం చేసేస్తే కేసు నమోదు చేయడంలోనూ చార్జిషీటు తయారు చేయడంలోనూ మరింత 'జాగ్రత్త' అవసరం అన్న నెపంతో పోలీసులు ఈ నేరాల పట్ల మరింత ఉదాసీనంగా ఉండే ప్రమాదం ఉంది.

అద్వానీ ప్రతిపాదన ఒక ఎత్తు అయితే మన రాష్ట్ర హైటెక్ ప్రభుత్వం దానికి వెంటనే మద్దతు ప్రకటించడం ఒక ఎత్తు. అభివృద్ధి మొత్తం కంప్యూటర్లలోనే కన్పిస్తించే మన ముఖ్యమంత్రికి, ఇతర విషయాలలో మన[illegible] జాన్ని మధ్యయుగాలకు వెనక్కు తీసుకుని పోయి[illegible] అభ్యంతరం లేనట్టుంది.

లైంగిక హింసను పెంచుతున్న సంస్కృతికి వ్యతిరేకంగా అందరమూ కృషి చేయవలసిన అవసరం చాలా ఉంది. శివసేన ఫక్కీలో రాళ్ళతో —కర్రలతో కాదు. సాంస్కృతిక పోరాటం బల ప్రయోగంతో జరిగేది కాదు. అది మనుషుల ఆలోచనా రీతుల మీద పోరాటం. దానికి తగిన మార్గాలు రూపొందించుకోవాలి. ప్రభుత్వవిధానాలు ఇందుకేమైనా తోడ్పడితే ఆహ్వానించవచ్చుగానీ మరణ దండనను చిట్కా వైద్యంగా భావించే శాసన సంస్కరణలు ఆహ్వానించదగినవి కావు....